



అమరవీరుల స్థూపం వద్ద అధికారుల నివాళి

అస్తవ్యస్త పాలన

- ఒకే భవనంలో మూడు సచివాలయాలు
- గోడౌన్‌ను తలపిస్తున్న కార్యాలయాలు
- సమయానికి రాని సిబ్బంది
- శృతి మించిన అధికార పార్టీ నాయకుల జోక్యం



మూడు సచివాలయాలు ఉన్న భవనం

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని నాగలకట్ట కాలనీకి చెందిన దుర్గావేణికి ఇంతవరకు స్మార్ట్ రేషన్ కార్డు అందలేదు. సచివాలయ సిబ్బంది ఇంటివద్దకే వచ్చి ఇస్తారని ఇన్ని రోజులు ఎదురు చూసింది. వారు రాలేదు. సచివాలయం వెనక భాగంలోనే ఆమె ఉంటున్న కాలనీ ఉంది. అయినప్పటికీ సిబ్బంది వెళ్లి స్మార్ట్ కార్డ్ ఇవ్వలేదు. స్మార్ట్ రేషన్ కార్డు కోసం సచివాలయం వద్దకు వచ్చింది. ఆమె వార్డు సచివాలయానికి సంబంధించిన సిబ్బంది లేరు. ఎవరిని అడగాలో తెలియని గందరగోళం.

పట్టణంలో 3వ సచివాలయ పరిధిలోని మారుతీనగర్‌లో వెంకటరాముడు ఉంటున్నాడు. ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన స్మార్ట్ రేషన్ కార్డులో వారి అమ్మాయి పుట్టిన తేదీ తప్పుగా ముద్రించారు. వాటిని సరి చేయడానికి సచివాలయం చుట్టూ ప్రదక్షణ చేస్తున్నాడు. సచివాలయ సిబ్బంది అతనికి సరైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారు. స్మార్ట్ రేషన్ కార్డులో తప్పులుంటే సచివాలయాల్లో మార్పులు చేసుకోవాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు చెబుతుంటే సచివాలయ సిబ్బంది మాత్రం తమకు తెలియదని చెబుతున్నారు.

ఇలా వీరిద్దరే కాదు. జిల్లాలో ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో వారంతా పథకాలకు దూరమయ్యారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రజల ముంగిటికే పాలన! అంటూ వైసీపీ సర్కారు వచ్చీ రాగానే 'ఇదో విప్లవం' అంటూ గ్రామ, వార్డు సచివాలయాలను ప్రారంభించింది. ప్రస్తుతం అంతా అయోమయం...ఎవరు వస్తారో.. ఏం పని చేస్తారో.. ఎక్కడ చేస్తారో తెలియని గందరగోళం నెలకొంది. సమస్యలపై వచ్చిన ప్రజలపట్ల పలువురు సచివాలయ సిబ్బంది అమర్యాదగా ప్రవర్తించి సరైన సమాధానం చెప్పకుండా అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొందరు హాజరు పుస్తకంలో సంతకాలు చేసి సొంత పనులకు బయటకు వెళుతుంటే మరి కొందరు అసలు హాజరు పట్టికలో సంతకాలే చేయడం లేదు..విధుల్లో ఉన్నారో లేదో తెలియడం లేదు. ఒక్కో సచివాలయంలో సగటున పదిమంది సిబ్బంది విధులు నిర్వహించాల్సివుంది. కొన్ని సచివాలయాల్లో కేవలం ఇద్దరు మాత్రమే కార్యాలయాల్లో ఉంటూ పనులు చేస్తున్నారు. మిగిలిన వారు ఎక్కడున్నారో? ఏమైపోయారో తెలియని పరిస్థితి. సచివాలయాలను పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు అంతంతమాత్రంగా పర్యవేక్షించడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.



సిబ్బందిలేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ఒకే భవనంలో మూడు సచివాలయాలు

పెనుకొండ మున్సిపాలిటీ పరిధిలో ఏడు సచివాలయాలు ఉన్నాయి. అందులో వెంకటరెడ్డి పల్లి, కోనాపురంలో ఒక్కొక్కటి ఉన్నాయి. మిగిలిన 5 సచివాలయాలు పట్టణంలో ఉన్నాయి. 3,4,5 సచివాలయాలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం ఆవరణలో అసంపూర్తిగా ఉన్న భవనంలో ఉన్నాయి. ఒకటి, రెండు సచివాలయాలు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో అధికారులు ఏర్పాటు చేశారు. ఇక మూడు, నాలుగు, ఐదు సచివాలయాలు ఒకే చోట ఉండడంతో సమస్యలపై వచ్చే ప్రజలు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. సిబ్బందిని అడిగితే సరైన సమాధానం చెప్పకుండా ప్రజల పట్ల విసుక్కుంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

గోడౌన్‌లా సచివాలయం

మూడు సచివాలయాలు ఒకే చోట ఉండడంతో అందులో సిబ్బంది సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కార్యాలయంలో టేబుళ్లు కుర్చీలు ఇతర సామాగ్రి ఎక్కడబడితే అక్కడ వేసి గోడౌన్‌గా మార్చివేశారు. కంప్యూటర్లను మూలకు వేశారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఎక్కడబడితే అక్కడ పారవేశారు. కార్యాలయం చూస్తే గోడౌన్ కంటే అధ్వానంగా మారిపోయింది.

ఖాళీగా ఉద్యోగులు.. విధులకు పలువురు డుమ్మా

ఒక్కో సచివాలయంలో సగటున పది మంది సిబ్బంది ఉన్నారు. ఎవరు ఏం చేస్తారో తెలియదు. ప్రతి సచివాలయానికీ ఒక ఇంజనీరింగ్ అసిస్టెంట్! కానీ పల్లెల్లో పనులే జరగనప్పుడు ఇంజనీరింగ్ అసిస్టెంట్ చేసేదేమిటి? ప్రతి సచివాలయంలో ఒక ఎనర్జీ అసిస్టెంట్. విద్యుత్ శాఖలో లైన్‌మెన్ ఉండగా ఎనర్జీ అసిస్టెంట్ ఏం చేస్తారో అర్థం కాదు. ఇక థర్మామీటర్, బీపీ చూసే యంత్రం లేకుండా ఏం చేయాలో హెల్త్ అసిస్టెంట్లకు అర్థం కావడంలేదు. 540 సేవలు అందిస్తున్నామంటూ సర్కారు గొప్పగా చెప్పడమే తప్ప పదుల సంఖ్యలోనూ సేవలు అందడంలేదు. చాలాచోట్ల సచివాలయాలకు సొంత భవనాలు లేవు. కొన్ని చోట్ల అసంపూర్తి నిర్మాణ భవనాలలో సచివాలయాలను నడుపుతున్నారు.

కొందరు ఉద్యోగులు హాజరైనట్లు సంతకాలు చేసి తర్వాత సచివాలయంలో ఉండకుండా సొంత పనులపై బయటకు వెళ్లిపోతున్నారన్న ఆరోపణలున్నాయి. పేరుకు సచివాలయాల ఉద్యోగులే దాదాపు నలుగురు సిబ్బంది మాతృశాఖ ఆధీనంలోనే పనిచేస్తున్నారు. విద్యుత్, వ్యవసాయం, ఏఎన్ఎం, ఫిషరీస్, వ్యవసాయం, హార్టికల్చర్, రెవిన్యూ సర్వే శాఖల ఉద్యోగులు ఆయా శాఖల్లోనే విధులు నిర్వహిస్తున్నారు.

ఖాళీగా సిబ్బంది..

ప్రస్తుతం అటెండెన్స్ పడగానే సచివాలయ కార్యదర్శులంతా ఆఫీసు వదిలి వెళ్లిపోతున్నారు. తిరిగి సాయంత్రం సచివాలయానికి చేరుకొని హాజరు వేసుకొని పిచ్చాపాటి మాట్లాడుకొంటూ కూర్చుంటున్నారు. 11మంది కార్యదర్శుల్లో ఒకరిద్దరు మాత్రమే ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు చేస్తూ కనిపిస్తున్నారు. మిగిలిన వారంతా ఖాళీగానే ఉంటున్నారు. ఇక ఉదయం 11 గంటలు దాటుతున్నా చాలా సచివాలయాల్లో సిబ్బంది జాడ కనిపించడం లేదు. కొందరు మాత్రమే విధులకు హాజరవుతుండగా, మరికొందరు ఫీల్డ్ విజిట్లకు వెళ్లారని, ఇంకొందరు సెలవులో ఉన్నారని చెబుతున్నారు. అయితే ఈ వివరాలను మూమెంట్ రిజిస్టర్‌లో పొందుపరచడం లేదు. వ్యవసాయ సిబ్బంది రైతు భరోసా కేంద్రాలకు పరిమితమవుతున్నారు. ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు కార్యాలయాల్లో ఉద్యోగుల లేక ఖాళీ సీట్లు దర్శనమిస్తున్నాయి. ఇక సచివాలయాల్లో సగానికి పైగా సీట్లు ఖాళీగా కనిపిస్తున్నాయి. సిబ్బందిలో అత్యధికులు ఫీల్డ్‌లో ఉన్నారని చెబుతున్నారు. ఇళ్ల లబ్ధిదారుల వెరిఫికేషన్ కోసం వార్డుల్లో పర్యటిస్తున్నారని పేర్కొంటున్నారు. సచివాలయం అడ్మిన్ సెక్రటరీ, వెల్ఫేర్ సెక్రటరీ మాత్రమే కార్యాలయంలో ఉంటున్నారు. శానిటేషన్ కార్యదర్శులను నియమించినప్పటి నుంచి ఇప్పటి వరకు వారు చేయాల్సిన ట్రేడ్ లైసెన్సుల జారీ, బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్, మ్యారేజ్ రిజిస్ట్రేషన్, పెట్ డాగ్స్ కంట్రోల్ తదితర బాధ్యతలను నిర్వహించడంలేదు. క్షేత్ర స్థాయిలో శానిటరీ వర్కర్లు, మేస్త్రీలు చేయాల్సిన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఆదాయం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఈడబ్ల్యుఎస్, రెవెన్యూ సంబంధించిన దరఖాస్తుల కోసం మాత్రమే ప్రజలు సచివాలయానికి వస్తున్నారు.

శృతి మించిన అధికార పార్టీ నేతల జోక్యం

సచివాలయాల్లో అధికార పార్టీ స్థానిక నాయకుల జోక్యం శృతి మించింది. కొన్నిచోట్ల టిడిపి నాయకులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ సచివాలయాల్లోనే తిష్ట వేస్తున్నారు. తమ పార్టీ మద్దతుదారులు వస్తే వెంటనే పని చేయిస్తున్నారు. అనేక సచివాలయాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది.

తిరిగి తిరిగి విసిగిపోయా



వారం పది రోజుల నుంచి స్మార్ట్ రేషన్ కార్డు కోసం తిరుగుతున్నా. షాప్ నెంబర్ 30 నాలుగో సచివాలయంలో ఇస్తారన్నారు. అక్కడికి పోతే నాలుగులో లేదు మూడులో చూడండి అన్నారు. మూడులోకి వెళ్తే అక్కడ లేదన్నారు. మరి ఎక్కడుందో తెలియడం లేదు. జిల్లా అధికారులు స్పందించి లబ్ధిదారులకు ఇంటి వద్దకే స్మార్ట్ రేషన్ కార్డులను అందించాలి.

బాబావలి,
పెనుకొండ

సిబ్బందికి షోకాజ్ నోటీసులు



హాజరు పుస్తకంలో సంతకాలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇబ్బందికి షోకాజ్ నోటీసులు అందిస్తున్నాం. సంతకాలు చేసి మూమెంట్ రిజిస్టర్ లో నమోదు చేయకుండా వెళ్లిన వారి పై చర్యలు తీసుకుంటాం. విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

సతీష్ కుమార్,
నగరపాలక సంఘం కమిషనర్

అమరవీరులను స్ఫూర్తిగా తీసుకుందాం

డిఐజి డాక్టర్ షిమోసీ

ప్రజాశక్తి - అనంతపురం

పోలీసు అమరు వీరుల త్యాగాలు, ఆశయాలను స్ఫూర్తిగా చేసుకుని విధుల్లో పునరంకితమవుదామని అనంతపురం రేంజ్ డిఐజి డాక్టర్ షిమోసి, జిల్లా ఎస్పీ పి.జగదీష్ పిలుపు నిచ్చారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆనంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా సాయుధ బలగాల నుండీ డిఐజి, కలెక్టర్ , ఎస్పీలు గౌరవ వందనం స్వీకరించి అనంతరం ప్రసంగించారు. స్మృతి పరేడ్ నిర్వహణ, పోలీసు అమర వీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడంలో పోలీసు, రెవెన్యూశాఖలు కీలకం అన్నారు. జిల్లా ప్రశాంతత, ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసుల విధులు ఉంటాయన్నారు. దేశ అంతర్గత భద్రతలో పోలీసుల పాత్ర కీలకమైనదని బాధ్యతాయుతమైనదని అన్నారు. ఈ వారోత్సవాలను ఈ ఏడాది అక్టోబర్ 21 ప్రారంభించి అక్టోబర్ 31 వరకు జరుపుకుంటామన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు, ప్రజలకు పోలీసు విధుల పట్ల అవగాహన కల్పించడం, విధి నిర్వహణలో పోలీసు వినియోగించే ఆయుధాలు, ఇతర సామగ్రి గురించి వారికి వివరించి ఆసక్తి పెంపొందిపచేస్తున్నామన్నారు. అభివృద్ధి జరగాలంటే సమాజం ప్రశాంతంగా ఉండాలనిసమాజం ప్రశాంతంగా ఉండాలంటే పోలీసు సేవలు తప్పనిసరి అని అన్నారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పోలీసు, రెవెన్యూ శాఖలు కీలకమని ఈ రెండు శాఖలు కలసి పని చేస్తే శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల శ్రేయస్సు అభివృద్ధి సులభమవుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ , తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ , ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, డీఎస్పీలు వి.శ్రీనివాసరావు, టి.వెంకటేశులు, రవిబాబు,శ్రీనివాస్, ఎస్ మహబూబ్ బాషా, నీలకంఠేశ్వరరెడ్డి (ఏ.ఆర్), జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సి.ఐ లు ధరణీకిశోర్ , క్రాంతికుమార్, దేవానంద్ , వెంకటేశ్వర్లు, శ్రీకాంత్ , జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ ఎస్ ఐ జాఫర్ , జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ, పలువురు ఎస్సైలు, ఆర్ ఎస్ ఐ లు, రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం నాయకులు, అమరవీరులైన పోలీసు కుటుంబాలు, తదితరులు పాల్గొన్నారు.

15 మందికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు : పోలీసు అమర వీరుల సంస్మరణ దినం వేడుకలో 15 మందికి కారుణ్య నియామకపు ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ ఆనంద్ అందజేశారు. కుటుంబ పెద్ద దిక్కులను కోల్పోయి బాధల్లో ఉన్న తమకుఉద్యోగాలిచ్చి ఊరట నివ్వడం ఆనందంగా ఉందని... ప్రత్యేక చొరవ చూపిన అనంతపురం రేంజ్ డిఐజి, జిల్లా ఎస్పీలకు మరియు నియామకపు ఉత్తర్వులు అందజేసిన జిల్లా కలెక్టర్‌కు పోలీసుకుటుంబాలు కృతజ్ఞతలు తెలిపాయి.

పోలీసు అమర వీరుల కుటుంబాలకు చెక్కులు అందజేత : కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన పోలీసు కుటుంబాలకు కుటుంబాలకు చెక్కులను అందజేశారు. అసాంఘిక శక్తుల చేతుల్లో చనిపోయిన నలుగురు పోలీసు కుటుంబాలకు, ఏడాదిగా వివిధ కారణాలతో చనిపోయిన ఏడుగురు పోలీసులు, ఆరుగురు హోంగార్డుల కుటుంబాలకు కలిపి మొత్తం రూ. 1.40 లక్షల విలవైన చెక్కులను ఆయా కుటుంబ సభ్యులకు అందజేశారు.

డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

ఎస్పీకి మహిళా సంఘాల ఐక్యవేదిక వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆసుపత్రికి వచ్చే పిల్లల తల్లులు, సిబ్బందిపై అమానుషంగా వ్యవహరించిన శ్రీనివాస చిన్న పిల్లల ఆసుపత్రి అధినేత డాక్టర్ శ్రీకాంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని, ఆ ఆసుపత్రిని సీజ్ చేయాలని మహిళా సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఐక్య వేదిక ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ పి.జగదీష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సావిత్రి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రిక తదితరులు శ్రీకాంత్‌రెడ్డి అనుసరిస్తున్న వైఖరిపై ఎస్పీకి వివరించారు. డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి వ్యవహరించిన అమానుష ఘటనలపై అన్ని చానల్స్‌లో వీడియోస్‌తో సహా ప్రచారం అయ్యాయని తెలిపారు. ఇలాంటి ఘటనలు జరగడం డాక్టర్ వృత్తికే అవమానకరమైందన్నారు. డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి పాల్పడిన చర్యలపై సమగ్ర విచారణ జరిపి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, హాస్పిటల్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఎస్పీ బాధితులు వచ్చి ఫిర్యాదు ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ పోలీసు సిబ్బందిని ఆసుపత్రికి పంపించి విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి అశ్విని, ఐక్య జేఏసి నాయకులు గీత, శైలజ, సాయి వైష్ణవి, శారద, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కులం కట్టుబాటు పేరుతో కుటుంబాన్ని వెలివేయడం అమానుషం : కుల కట్టుబాటును కాదంటూ మరో గ్రామం అమ్మాయితో పెళ్లి సంబంధం కుదుర్చుకుని నిశ్చితార్థం చేసుకున్నందుకు ఆ అబ్బాయి కుటుంబాన్ని వారి కులం నుంచి వెలివేసే సంఘటన చోటు చేసుకోవడం అమానుషమనిమహిళా సంఘాల ఐక్య వేదిక నాయకురాలు వి.సావిత్రి అన్నారు. ఉరవకొండలోని శివరామిరెడ్డి కాలనీలో చోటు చేసుకున్న ఈ సంఘటనపై మహిళా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉరవకొండలోని శివరామిరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న బోగి వెంకటేష్ కుమారుడు బోగి మణికుమార్‌కు కర్నాటక రాష్ట్రానికి చెందిన అమ్మాయితో వివాహ నిశ్చితార్థం చేసుకోవడానికి ఇరు కుటుంబాల పెద్దలు నిర్ణయించారన్నారు. అమ్మాయి, అబ్బాయిఉన్నత చదువులు చదువుకోవడంతో వారి భవిష్యత్తు బాగుంటుందని పెళ్లికి సిద్ధ పడి ఘనంగా వీరి నిశ్చితార్థం చేశారని తెలిపారు. ఈ విషయం సంచార కుల జాతుల పెద్దలకు తెలియడంతో వారు పంచాయతీ ఏర్పాటు చేశారని తెలిపారు. కర్నాటక వారిని ఎప్పుడు పెళ్లి చేసుకోలేదని, మీరెలా చేసుకుంటారని ప్రశ్నించి వారిని 30 ఏళ్ల పాటు కుల బహిష్కరణ చేస్తూ పంచాయతీలో తీర్మాణం చేశారన్నారు. నిశ్చితార్థానికి వెళ్లిన ఇతరుల నుంచి కూడా ఒకరు రూ.1200 సంఘానికి రుసుం చెల్లించాలని హుకుం జారీ చేశారన్నారు. ఈ అధునాతన సమాజంలో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఆ కుల పెద్దలపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల ఐక్య వేదిక నాయకులు చంద్రిక, పార్వతి ప్రసాద్, శారదా, యశోదమ్మ, అశ్విని, గీత, శైలజ, సాయి వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వ్యవసాయసహాయకుడి అవినీతిపై విచారణ

ప్రజాశక్తి - బ్రహ్మసముద్రం

మండల పరిధిలోని కన్నేపల్లి గ్రామ సచివాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు గా విధులు నిర్వహిస్తున్న విద్యాసాగర్ అవినీతి అరోపణలపై వ్యవసాయ శాఖ అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ మేరకు ఎడి ఎల్లప్ప, వ్యవసాయ అధికారి గోపాల్, ఎఇఒ నంద కిరణ్, విఆర్ఎ గంగాధర తదితరులు మంగళవారం మండల పరిధిలోని బుడిమేపల్లి గ్రామానికి చెందిన బాధిత రైతు ఆంజనేయులు ఇంటి వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. బాధిత రైతు ఈనెల 13వ తేదీన మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ (గ్రీవెన్స్)లో తహశీల్దార్ సుమతికి ఫిర్యాదు చేశారు. అ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. కన్నేపల్లి గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న విద్యాసాగర్ పంచాయతీ పరిధిలోని కన్నేపల్లి, ముద్దలాపురం, గుడిపల్లి, బుడిమేపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతుల వద్ద యూరియా, వేరుశెనగ, డ్రిప్ పైపులు, పివిసి పైపులు, వ్యవసాయ యంత్రాలైన ట్రాక్టర్, రోటివేటర్, టిల్లర్లు వివిధ రాయితీపరికాలు ఇప్పిస్తానని నమ్మబలికి లక్షల రూపాయలు వసూలు చేసి పరారయ్యాడు. ఈ ఘటనపై బాధిత రైతులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొత్తం 46 మంది రైతుల నుండి సుమారు రూ.10,01,320 నగదును తీసుకొని ఏపీ సీడ్స్ కు చెల్లించాల్సిన సొమ్మును ఆ సంస్థకు జమ చేయకుండా సొంత ఖర్చులకు వాడినట్లు తెలుస్తోంది. ఆగస్ట్, సెప్టెంబర్ నెలలకు సంబంధించిన సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ చేసి అనంతరం మిగిలిన 80వేల రూపాయల సొమ్ము ను తిరిగి ప్రభుత్వానికి జమ చేయలేదనిమండల ప్రజా పరిషత్ కార్యలయ పంచాయతీ కార్యదర్శి యోగేష్ విద్యాసాగర్ పై పోలీస్ స్టేషన్లో అప్పట్లో ఫిర్యాదు చేశాడు. విత్తన వేరుశెనగ కోసం రైతుల నుండి తీసుకున్న సొమ్ము 8,11,240 రూపాయలు, ఎరువులు కోసం బాధిత రైతుల నుండి 1,14,842 రూపాయలు మొత్తం రూ. 9,26,082 వ్యవసాయ సహాయకుడు విద్యాసాగర్ ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు చెల్లించలేదు. ఈ నేపథ్యంలో కన్నెపల్లి పంచాయతీ బుడిమేపల్లి గ్రామానికి చెందిన బాధిత రైతు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు మంగళవారం విచారణ చేపట్టిన వ్యవసాయ శాఖ అధికారులు బాధిత రైతుతో మాట్లాడారు. ఆ రైతు ఫోన్ పే, పేటీఎం నుండి సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకుడు విద్యాసాగర్‌కు రూ.2,03,600లు బదిలీ జరిగినట్లు నిర్ధారించారు. ఈ విషయంపై పూర్తి నివేదికను జిల్లా అధికారులకు పంపనున్నట్లు వారు తెలిపారు.



బాధిత రైతుతో మాట్లాడుతున్న అధికారులు

రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలను విజయవంతం చేద్దాం

ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు ఆనంద్, శ్యాంప్రసాద్



సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా కలెక్టర్లు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లాలో నవంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు - 2025ను సమిష్టిగా విజయవంతం చేద్దామని అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు ఓ.ఆనంద్, ఏ.శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతికఉత్సవాలు - 2025పై సంబంధిత అధికారులతో ఇరు జిల్లాల కలెక్టర్లు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 7, 8, 9 తేదీల్లో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు నగరంలోని ఆర్‌డిటి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల కోసం వసతి సదుపాయాలు, భోజనం, ఇతర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఆర్డీటీ స్టేడియంలో అన్ని ఏర్పాట్లు చేపట్టాలని, ఏ జిల్లాల నుంచి ఎవరెవరు క్రీడాకారులు వస్తారన్నది ముందుగానే తెలుసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీనియర్ ఉన్నతాధికారులు వచ్చే అవకాశం ఉందని, డయాస్ ఏర్పాట్లు, ప్రోటోకాల్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల అధికారులు సమన్వయం చేసుకొని పని చేసి రెవెన్యూ క్రీడలను విజయవంతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. స్థానికంగా వసతి నుంచి క్రీడలు జరిగే ఆర్డీటీ స్టేడియానికి రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీవోలు కేశవ నాయుడు, వసంత బాబు, ఏబీవీఎస్‌బి శ్రీనివాస్, ఆర్‌డిఒలు మహేష్, వివిఎస్.శర్మ, సువర్ణ, ఆనంద్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి, సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, డిఎస్ఒ వెంకటేశ్వర్లు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దివాకర్ బాబు, సెక్రటరీ సోమశేఖర్, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, తహశీల్దార్లు హరికుమార్, మోహన్ రావు, బాలకిషన్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు 'విజన్' విద్యార్థి

యాడికి : మండలంలోని విజన్ హైస్కూల్ విద్యార్థి తృషిత స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి అండర్-17 విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైంది. డివిజన్ స్థాయి పోటీల్లో యాడికి జట్టు పెద్దవడుగూరు, గుంతకల్లు జట్లను ఓడించి గుత్తి జట్టుతో ఫైనల్స్‌లో తలప డింది. ఇందులో యాడికి జట్టు గుత్తి జట్టును 25-15 25 -12 పాయింట్లు తేడాతో ఓడించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. యాడికి వాలీబాల్ జట్టులో తృషిత అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు విజన్ విద్యా సంస్థల అధినేత విశ్వనాథ్ తెలిపారు.

అవినీతి నిర్మూలన అందరి బాధ్యత

ఎసిబి సిఐ హమీద్ ఖాన్

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ శాఖల్లో అవినీతిని నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉందని యాంటీ కరప్షన్ బ్యూరో (ఎసిబి) సిఐ పఠాన్ హమీద్‌ఖాన్ అన్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలలో కిందిస్థాయి నుండి ఉన్నత స్థాయి వరకు ప్రజా సేవకులుగా పని చేయాలన్నారు. అలా చేయకుండా లంచం అడిగిన వారిపై చట్టపరమైన చర్యలు కఠినంగా ఉంటాయ హెచ్చరించారు. అవినీతి అంతం కావాలంటే సమిష్టి కృషి అవసరమన్నారు. ఎవరైనా నిర్భయంగా అవినీతి నిరోధక శాఖ దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. అలా సహకరించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. తప్పు చేసిన అధికారులకు శిక్షపడేలా చేస్తామన్నారు. ఇందులో భాగంగానే మూడు నెలలుగా అవినీతి నిరోధానికి తమతో చేయి కలిపిన పలువురికి ప్రోత్సాహక ప్రశంసాలను అందించమన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి యాంటీ కరప్షన్ బ్యూరోకు సమాచారం ఇవ్వడానికి సెల్..949130 5616 నెంబర్‌కు సమాచారం ఇవ్వవచ్చునన్నారు. 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. ఇదేక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 1064 నెంబరు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి అవినీతి అంతానికి అవినీతిపరుల భరతం పట్టడానికి తమతో చేయి కలపాలని పిలుపునిచ్చారు.



అవినీతి అధికారిని పట్టించిన వ్యక్తిని సన్మానిస్తున్న హమీద్‌ఖాన్

బీటీపీ కాలువ పనులు పరిశీలన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం ప్రాంత జీవనాడిగా భావించే భైరవానితిప్ప కాలువ పనులను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా పలువురు నాయకులతో కలిసి బోరంపల్లి-ఒంటిమిద్ది గ్రామాల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించిన ఇంజినీర్లతో చర్చించారు. ఈ సందర్భంగా భైరవానితిప్ప, కుందుర్పి బ్రాంచు కెనాల్ కాలువ పనులు ఇప్పటికే బ్రహ్మసముద్రం మండలం వెస్టుకోడిపల్లి, కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి, బెళుగుప్ప మండలం దుద్దెకుంట గ్రామాల వద్ద పనులు శరవేగంగా జరుగుతున్నట్లు స్థానిక ఇంజినీర్లు వివరించారు.



ఒంటిమిద్ది వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు



విలేకరులతో మాట్లాడుతున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

చంద్రబాబు పాలనతో తగ్గిన నేరాలు

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంతోపాటు తాడిపత్రి నియోజకవర్గంలో నేరాల శాతం పూర్తిగా తగ్గిందని మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా జెసి నివాసం నుంచి పట్టణ కౌన్సిలర్లు, టిడిపి కార్యకర్తలు, జెసి అభిమానులు ర్యాలీ పట్టణంలోని గాంధీ సర్కిల్‌కు చేరుకుని అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి తాడిపత్రిలో విధులు నిర్వహిస్తుడటంతో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఆయన నేరాలను అదుపు చేసినట్లు చెప్పుకోవడం సరైంది కాదన్నారు. టిడిపి వచ్చాకే క్రైమ్ రేట్ తగ్గింది తప్ప.. ఆయన చేసిందేమీ మేదన్నారు. తాడిపత్రిలో శాంతిభద్రతలు సంరక్షించడంలో ఏఎస్పీ విఫలమయ్యాడని విమర్శించారు. ఎందుకంటే ఏ రోజూ రోహిత్‌కుమార్ చౌదరి ఖాకీ దుస్తుల్లో కనిపించలేదన్నారు. ఎఎస్పీకి చదువుంది కానీ బుద్ధి లేదని.. పనికిమాలిన వాడని ఘాటు విమర్శలు చేశారు.

వాలీబాల్ పోటీలకు ఎంపిక

పామిడి : స్థానిక టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, గుంతకల్లు డివిజన్ వాలీబాల్ టోర్నమెంట్, ఎంపిక పోటీలు అట్టహాసంగా సాగాయి. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామ్‌కుమార్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, రామకృష్ణ, నవీన్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో అధ్యాపకులు

అమెరికా సుంకాలను వ్యతిరేకిస్తూ నిరసనలు

ప్రజాశక్తి-శింగనమల

వ్యవసాయ ఉత్పత్తులపై అమెరికా సామ్రాజ్యవాద ట్రంపు పెంచిన సుంకాలను నిరసిస్తూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అమెరికా అధ్యక్షులు ట్రపు ఫ్లెక్సీలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంతోపాటు పాడి, ఎగుమతి చేసే ఉత్పత్తులపై 11 నుంచి 50 శాతం అమెరికా విధించిన సుంకాలతో వ్యవసాయ రంగం దివాలా తీసే పరిస్థితి దాపురించిందన్నారు. అమెరికా సామ్రాజ్యవాద చేష్టలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కనీసం ప్రశ్నించకపోవడం 150 కోట్ల భారత దేశ ప్రజలను అవమానించడమే అన్నారు. అంతేగాకుండా అభివృద్ధి అనే పేరు చెప్పి రాష్ట్రంలోని 32 కేంద్రాల్లో సుమారు మూడు లక్షల ఎకరాల భూములను అదానీ, అంబానీలకు కట్టబెడుతోందని వాపోయారు. భూములు సేకరించే ప్రాంతాల్లో 2013 చట్టం అమలు చేయడం లేదన్నారు. ఈ విధానం ద్వారా వ్యవసాయ కార్మికులు పనులు కోల్పోయి ఉపాధి దెబ్బతిని పెద్దఎత్తున వలసలు వెళ్తున్నారన్నారు. కౌలుదారులు వీధిపాలవుతున్నారు. కావున బలవంతపు భూసేకరణ ఆపాలని, 2013 చట్టాన్ని అమలు చేయాలని, భూసేకరణ చేసిన ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులకు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో. నాయకులు మేకల పెద్దన్న, సూర్యప్రకాష్, కొండారెడ్డి, సుంకన్న, కొళ్లాయప్ప, రామాంజనేయులు, నల్లప్ప, సూర్యప్రకాష్, శ్రీనివాసులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



శింగనమలలో కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

పుట్లూరు : అమెరికా అధ్యక్షులు ట్రంపు సుంకాలను నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కడవకల్లు బస్టాండ్ సర్కిల్‌లో ఫెక్సీని దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో నాయకులు సూరి, టి.పెద్దయ్య, వి.కుళ్లాయప్ప, జె.పెద్దయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నాగభూషణం, శ్రీరాములు, హరి, మహిళా నాయకురాలు మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : అమెరికా సుంకాలను వ్యతిరేకిస్తూ స్థానిక సిఐటియు కార్యాలయంలో మండల అధ్యక్షులు మాబు ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల గౌరవాధ్యక్షులు మల్లేష్, ఎపి రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్‌కుమార్, సాయికుమార్, వకాసం అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, షాషావలి, భవన నిర్మాణ కార్మిక సంఘం బాధ్యులు మల్లికార్జున, ఓబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు పోరాట ఫలితమే మృతుల కుటుంబాలకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని గత రెండున్నరేళ్లుగా సిఐటియు చేసిన పోరాటం ఎట్టకేలకు ఫలించినట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, కార్యవర్గ సభ్యులు మల్లికార్జున తెలిపారు. మంగళవారం కార్మికులతో కలిసి కార్మికులకు ఉద్యోగం రావడానికి సహకరించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇందులుఓ భాగంగా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు పోరాట ఫలితంగా రాయదుర్గం పురపాలక సంఘంలో విధి నిర్వహణలో మరణించిన లోకనాథ్‌రెడ్డి, రామాంజనేయులు సతీమణులకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఇందుకు సహకరించిన విప్ కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్, కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు



నియామక పత్రాలు అందజేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప

అనంతరం ఛైర్‌పర్సన్ శిల్ప ఆయా కార్మికులకు నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాము, నాగరాజు, తిప్పేరుద్ర, తిప్పేస్వామి, మల్లేష్, ఎర్రిస్వామి విజయ్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్ సవీరాలో అరుదైన శస్త్రచికిత్స

క్లోమానికి చిన్నపేగు కలిపి కుట్టి ప్రాణదానం-17 ఏళ్ల యువతికి ఆపరేషన్

ప్రజాశక్తి-అనంతపురం

ఇంటర్ చదువుతున్న 17 ఏళ్ల యువతికి చిన్నతనం నుంచి పదేపదే కడుపునొప్పి వస్తుండేది. ఆమెను హైదరాబాద్‌లోని పెద్ద ఆస్పత్రిలో చూపించగా చాలా అరుదైన వంశపారంపర్య పాంక్రియాటైటిస్ అనే సమస్య ఉందని తేలింది. అంటే ఆమె క్లోమం (పాంక్రియాస్)లో రాళ్లు ఏర్పడ్డాయి. దానికి పలుమార్లు ఎండోస్కోపీ చికిత్సలు చేసినా, తాత్కాలికంగా ఒక నెల రోజులు ఊరట లభించి మళ్లీ నొప్పి మొదలయ్యేది. మందులు వాడినా ఉపయోగం లేకపోవడంతో ఆ యువతిని అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ ఆ యువతిని పరీక్షించి, సంక్లిష్టమైన ఫ్రేస్ ప్రొసీజర్ శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్లు కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ ఎన్.మహ్మద్ షాహిద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆయన వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి..



బాధితురాలితో వైద్యులు

అక్షయ అనే ఆ యువతికి పదేపదే కడుపునొప్పి వస్తుండేంది. స్టెంట్ వేసినా నెలరోజులు ఆగి తర్వాత మళ్లీ నొప్పి రావడంతో అప్పుడు కిమ్స్ సవీరాకు తీసుకొచ్చారు. ఇక్కడ సమగ్రంగా పరీక్షిస్తే ఆమె క్లోమంలోని తల, శరీరం, తోక.. మూడు భాగాల్లోనూ రాళ్లు ఏర్పడుతున్నాయని తెలిసింది. దీంతో ఆమెకు శస్త్రచికిత్స చేయడం తప్ప మరో మార్గం లేదని నిర్ణయించి అత్యంత సంక్లిష్టమైన, అత్యాధునికమైన ఫ్రేస్ లేటరల్ పాంక్రియాటికో జెజునోస్టమీ (ఎల్‌జేపీ) అనే శస్త్రచికిత్స చేశామన్నారు. ఇందులో భాగంగా ముందుగా ఆమె క్లోమాన్ని కత్తిరించి, అందులో ఉన్న మొత్తం రాళ్లను తీసేశామన్నారు. తర్వాత ఆమె చిన్నపేగులో కొంత భాగాన్ని తీసుకుని, దాన్ని క్లోమంతో కలిపి కుట్టామని వివరించారు. దీనివల్ల ఇక మీదట రాళ్లు ఏర్పడినా, అవి ఆ చిన్నపేగు భాగంలోకి వెళ్లిపోతాయితప్ప క్లోమంలోకి వెళ్లవన్నారు. క్లోమరసం పేగుల్లోకి వెళ్లేందుకు ఒక డక్ట్ ఉంటుందన్నారు. అందులోకి పెద్ద పరిమాణంలో రాళ్లు చేరితే క్లోమరసం పేగుల్లోకి వెళ్లదు. ఫలితంగా తిన్న ఆహారం జీర్ణం కాదన్నారు. క్లోమంలో రాళ్లు ఏర్పడడం అనేది వంశపారంపర్యంగా తలెత్తే సమస్య అన్నారు. ఇది ఎక్కువగా చిన్నపిల్లల్లోనే కనిపిస్తుందన్నారు. ఈ సమస్య ఉన్నవారిలో నాలుగోవంతు మందికి మధుమేహం కూడా వస్తుందన్నారు. పిల్లలకు కడుపునొప్పి తగ్గకుండా వస్తుంటే తప్పనిసరిగా వైద్యులకు చూపించాలన్నారు.

వ్యవసాయాన్ని కాపాడుకుందాం

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

రైతుల వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీల వ్యవసాయంగా మార్చే ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా రైతాంగం సంఘటితంగా పోరాడాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం కూడేరు మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం సంఘం నాయకులు ఈరప్ప అధ్యక్షత మండల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగించిందని విమర్శించారు. ప్రభుత్వాల విధానాలు ఫలితంగానే రైతుల వ్యవసాయం నష్టాల్లో ఉందన్నారు. ఫలితంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీల వ్యవసాయంగా మార్చడం దుర్మార్గమని విమర్శించారు. రైతాంగం కోరుతున్న విధంగా మద్దతు ధరల గ్యారంటీ చట్టం తీసుకురావాల, రైతు రుణాలు మాఫీ చేయాలని, బలవంతపు భూ సేకరణ ఆపాలని, డిమాండ్ చేశారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పత్తిపై సుంఖం తగ్గింపు వల్ల మన రైతులకు ఆత్మహత్యలే శరణ్యమవుతాయన్నారు. ఆయా సమస్యలపై వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కరీం, మండల అధ్యక్షులు కార్యదర్శి రాధాకృష్ణ, మల్లికార్జున, రైతుసంఘం మండల నాయకులు ఈరప్ప, వెంకటేష్, పెద్దన్న, కాశీం, పెద్దన్న, హుస్సేన్‌సాబ్, మల్లి, కొండన్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు



ఎంపికైన క్రీడాకారులతో అధ్యాపకులు

పోటాపోటీగా వాలీబాల్ పోటీలు

బెలుగుప్ప : మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 వాలీబాల్ బాల, బాలికల డివిజినల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. డివిజినల్ లెవెల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 22వ తేదీన అనంతపురంలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారి పి.మల్లారెడ్డి, మండల విద్యాధికారి హరికృష్ణ, ప్రధానోపాధ్యాయులు వెంకటప్రసాద్, టిడిపి జిల్లా కార్యదర్శి బి.మల్లికార్జున, పెద్ద తిప్పయ్య, పాఠశాల కమిటీ ఛైర్మన్ రుద్రయ్య, పీడీ, డివిజినల్ కోఆర్డినేటర్ గోపాల్‌రెడ్డి, టోర్నమెంటు అబ్జర్వర్ బి.ఈశ్వర్‌రెడ్డి, ఎపిఎన్‌ఎపి రాష్ట్ర నాయకులు, పీడీ ప్రభాకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ధన్వంతరి జయంతి

కళ్యాణదుర్గంటౌన్ : స్థానిక త్యాగరాజుస్వామి మందిరంలో నాయిబ్రహ్మణుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యగురువు ధన్వంతరి జయంతి ఉత్సవాలను జరుపుకున్నారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు మల్లికార్జునస్వామి, యోగానంద, మోహన్‌ప్రకాష్, పట్టణాధ్యక్షులు రవి, సంక్షేమ సంఘం రాయలసీమ కన్వీనర్ ధనుంజయ, వెంకటరమణ, లక్ష్మినారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యువత భవిష్యత్తు కోసమే 'కోటి సంతకాలు' : వైసిపి

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలోని యువత భవిష్యత్తు కోసమే మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టినట్లు ఎమ్మెల్సీ మాజీ విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను నిరసిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణలో గోపాల్‌రెడ్డి మంగళవారం సంతకం చేసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జగన్మోహన్‌రెడ్డి పోరాట ఫలితంగా రాష్ట్రానికి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు వస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పిపిపి విధానాన్ని తీసుకొచ్చి ప్రయివేటీకరించేందుకు పూనుకుందన్నారు. వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవి రమణ, నాయకులు ప్రభాకర్, ఆదినారాయణ చౌదరి, మాజీ ఎన్‌జిఒ నాయకులు ఓబుల్‌రావు, కొండారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, ప్రకాష్, విశ్వేశ్వర్‌రెడ్డి, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు



సంతకం చేస్తున్న ఎమ్మెల్సీ మాజీ విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డి



పెట్రోల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

గుత్తిలో కల్తీ పెట్రోలు విక్రయం

వాహనదారుడి ఫిర్యాదుతో అధికారుల తనిఖీ

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని గాంధీ కూడలిలో ఉన్న ఓ పెట్రోలు బంకులో వినియోగదారుడికి మంగళవారం కల్తీ పెట్రోలు పట్టారు. స్థానిక గుంతకల్లు రోడ్డులో పిండిమిషన్ నిర్వాహకుడు చంద్రశేఖర్ తన ద్విచక్రవాహనం ఆగిపోతే ఖాళీ బాటిల్ తీసుకుని సమీపంలోని శ్రీరామ పరమేశ్వరయ్య పెట్రోలు బంకుకు వెళ్లాడు. బాటిల్‌లోకి పెట్రోల్ పట్టిన తర్వాత రంగు తేడా ఉండటంతో సిబ్బందిని నిలదీశాడు. తన బాటిల్‌కు పట్టిన పెట్రోలు కల్తీ అయిందని, పెట్రోలులో నీరు కలిసిందని చెప్పాడు. అనంతరం పోలీసులతోపాటు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుతో ఎస్‌ఐ కె.సురేష్ పెట్రోల్ బంకు వద్దకు చేరుకుని పరిశీలించాడు. ఈయనతోపాటు ఉప తహశీల్దార్ కె.సూర్యనారాయణ, సిఎస్‌డిటి ప్రవీణ్‌కుమార్ అక్కడికి వెళ్లి కల్తీ జరిగిందన్న పెట్రోలు బాటిల్‌తో పాటు మరో బాటిల్ పెట్రోలు ను పరీక్షల నిమిత్తం తహశీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లారు. పెట్రోలు బాటిల్‌ను సీజ్ చేసి జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయానికి పరీక్షల నిమిత్తం పంపనున్నట్లు సిఎస్‌డిటి తెలిపారు. పెట్రోల్ కల్తీ అయిందని ఆరోపణలు రావడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛమైన పెట్రోలును సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

2న శింగనమల చెరువులో తెప్పోత్సవం

ప్రజాశక్తి-శింగనమల

వచ్చేనెల 2వతేదీన మండల కేంద్రంలోని రంగరాయుని చెరువులో తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ భాస్కర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆత్మారామ ఆలయ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని చెరువులో దశాబ్దాల నుంచి తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే వచ్చేనెల 2వతేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ ఉత్సవానికి శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. కావున మండలంలోని ప్రజలు, భక్తులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి తిప్పేస్వామి, రామ్‌చరణ్‌యాదవ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ భాస్కర్

ఓపెన్ డ్యాన్స్ పోటీల్లో 'భాష్యం' విద్యార్థుల సత్తా



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

అనంతపురం సిటీ : నగరంలోని ఇండోర్ స్టేడియంలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఇటీవల ఏర్పాటు చేసిన జిల్లా ఓపెన్ డ్యాన్స్ పోటీల్లో భాష్యం విద్యార్థులు సత్తా చాటారు. ఈమేరకు అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్‌ఛైర్మన్ హనుమంతరావు, జిల్లా జడ్ఇఒ రవివర్మ, ప్రిన్సిపల్ ప్రణీత, ప్రధానోపాధ్యాయులు సబీహ తెలిపారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా..

ఆత్మకూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. మండల సర్వసభ్య సమావేశానికి కేవలం అధికారులు, అధికార పార్టీకి చెందిన ఒక ఎంపిటిసి మాత్రమే హాజరు కావడంతో కోరం లేక వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వంలో తమకు కనీస గౌరవం లేకుండా పోయిందని వైసిపికి చెందిన సర్పంచులు, ఎంపిటిసిలు వాపోతున్నారు. దీంతోనే వారందరూ మూకుమ్మడిగా సమావేశానికి గైర్హాజరైనట్లు తెలుస్తోంది. చేసేది లేక అధికారులు నేటికి సమావేశాన్ని వాయిదా వేశారు. అయితే నేడు కూడా సమావేశం జరుగుతుందా.. లేదా అనే అనుమానులు ఉన్నాయి.



అరకొర హాజరైన సభ్యులు

హోటళ్లలో కమర్షియల్ సిలిండర్లనే వాడాలి

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-ఆత్మకూరు

హోటళ్లతోపాటు ఇతర వాణిజ్య వినియోగాలకు కేవలం కమర్షియల్ సిలిండర్లనే వాడాలని సిఎస్‌డిటి మండల సివిల్ సప్లయ్ అధికారిణి సూచించారు. ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో మండలంలోని పలు టీస్టాళ్లు, హోటళ్లలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు వాడుతున్నారని కథనం ప్రచురితమైన విష యం తెలిసిందే. ఇందుకు స్పందించిన మండల సివిల్ సప్లయ్ అధికారిణి మంగ ళవారం మండలంలోని టీ స్టాళ్లు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్‌డిటి మాట్లాడుతూ టీస్టాళ్లు, హోటళ్ల యజమానులు తప్పనిసరిగా కమర్షియల్ సిలిండర్లనే వాడాలన్నారు. అలాకాకుండా గృహ అవసరాలకు వాడే సిలిండర్లను వాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



హోటల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న సిఎస్‌డిటి

నేరాలు ఘోరాలు

రైలు నుంచి కిందపడి వ్యక్తికి గాయాలు

గుత్తి : రైల్వే స్టేషన్ లో రైలులో నుంచి దిగుతూ ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. జిఆర్‌పి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా పత్తికొండ చెందిన వీరేష్ రైలులో ప్రయాణిస్తున్నాడు. గుత్తి రైల్వేస్టేషన్‌లో రెండవ ప్లాట్‌ఫామ్‌పై ఆగి ఉన్న రైలు నుంచి దిగడానికి అతడు ప్రయత్నించాడు. స్టేషన్‌లో రైలు వేగం పెంచడంతో అతడు కిందకి దిగుతూ పట్టు తప్పి రైలు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధురాలికి..

రాయదుర్గం : గుమ్మగట్ట మండలం గోనబావి గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ గ్రామానికి చెందిన తిప్పక్క తీవ్రంగా గాయపడింది. తిమ్మక్క కూలి పనికి వెళ్లి గ్రామానికి తిరిగి వస్తుండగా ఎరడికేర వైపు నుంచి వచ్చిన మోటార్ సైకిల్ ఢీకొంది. దీంతో ఆమె కాలు విరిగింది. మోటార్ సైకిల్ నడుపుతున్న నాగరాజు కూడా స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడిన వీరిని రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపిడిఓ

సచివాలయం తనిఖీ

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని కన్నేపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఓ ఉమాదేవి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామ ప్రజలకు నీటి సౌకర్యం సౌలభ్యంగా ఉందా.. లేదా.. అని పంచాయతీ కార్యదర్శి యోగేష్‌ను అడిగారు. అలాగే రోజూ పాఠశాలను తనిఖీ చేస్తున్నారా.. లేదా.. అని వెల్ఫేర్ అసిస్టెంట్ రమేష్ ను అడిగి తెలుసుకున్నారు. తర్వాత అంగన్వాడీలో అందజేసి పౌష్టికాహారంపై మహిళా పోలీస్ శ్రీజతో ఆరాతీశారు. సచివాలయ సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ తిరుపతయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జైస్వరాజ్ పార్టీ వ్యకాసం రాష్ట్ర అధ్యక్షులుగా అమర్నాథ్‌యాదవ్

శింగనమల : జై స్వరాజ్ పార్టీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా మండలంలోని పెద్దజలాలపురం గ్రామానికి చెందిన మేకల అమర్నాథ్‌యాదవ్‌ను నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు కాసాని శ్రీనివాసరావుగౌడ నియమక ఉత్తర్వులను జారీ చేశారు. అమర్నాథ్ వ్యవసాయ కార్మిక ఉద్యమాల్లో విస్తృత అనుభవంతోపాటు మొదటి నుంచి జైస్వరాజ్ పార్టీలో పని చేస్తున్నారు. పార్టీ కోసం పని చేస్తున్న ఆయనకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వడం గమనార్హం. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షునిగా నియమించిన జాతీయ అధ్యక్షులు కాసాని శ్రీనివాసరావు గౌడకు, రాష్ట్ర నాయకులకు అమర్నాథ్ కృతజ్ఞతలు తెలిపారు.

సాగు భూములివ్వాలని వినతి

కళ్యాణదుర్గం టౌన్ : నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన అర్హులకు ఇంటిస్థలాలు, సాగు భూములు ఇవ్వాలని తాలుకా ఎస్సీ, ఎస్టీ, జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. ఈవిషయమై మంగళవారం సంఘం నాయకులు చెలిమప్ప, మధు, అనీల్, మల్లేష్, కొల్లప్ప, మారుతి తదితరులు తహాశీల్దార్ బాస్కర్‌ను కలిసి వివరించారు. చాలామంది పేదలు ఇప్పటికి స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నారని, అలాంటి వారిని గుర్తించి న్యాయం చేయాలని కోరారు.

ఆకులేడు సర్పంచి తల్లి మృతి



నివాళులర్పిస్తున్న ఎర్రిస్వామిరెడ్డి

శింగనమల : మండల పరిధిలోని ఆకులేడు సర్పంచు మల్లెల రామంజినేయులు మాతృమూర్తి మల్లెల అంజినమ్మ (80) మృతికి పలువురు వైసిపి నాయకులు మంగళ వారం నివాళు లర్పించారు. విషయం తెలుసుకున్న వైసిపి యువ నాయకులు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి గ్రామానికి చేరు కుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పేకాటజూదరుల అరెస్టు

డి.హీరేహాల్ : మండలంలోని మడేనహళ్లి గ్రామ శివారులో మంగళవారం ఉదయం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మడేనహళ్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి జూదరులను అదుపులోకి తీసుకోవడంతోపాటు నిందితుల నుంచి రూ.31,250 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది నాగరాజు, రంగారెడ్డి, రామాంజినేయులు, మల్లికార్జున పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి



రాయదుర్గంలో నివాళులర్పిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో అమరవీరులకు నివాళులర్పించారు. ఇందులో భాగంగా వీరజవాన్ మురళీనాయక్‌తోపాటు అమరవీరుల చిత్రపటాలకు ఇన్స్‌పెక్టర్ జయనాయక్, సిబ్బంది పూలమాలు వేసి అంజళి ఘటించారు. ఈ సందర్భంగా వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఆర్డీఓ వసంతబాబు, సీఐ హరినాథ్ కొనియాడారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పోలీస్‌సిబ్బంది, కరణంచిక్కప్ప ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ పట్టణంలో ర్యాలీ చేశారు.

యాడికి : పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా మండలంలోని రాయలచెరువు గ్రామ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బత్తలపల్లి ఆర్డీటీ సహకారంతో మంగళవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ



కళ్యాణదుర్గంలో నివాళులర్పిస్తున్న ఆర్డీఓ, సీఐలు

శిబిరంలో సుమారు 60 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీటీ సభ్యులు, విశ్రాంత ఆర్మీ జవాన్లు మాదల రాజశేఖర్, మాదల రవికుమార్‌ను ఘనంగా సన్మానించారు. అలాగే లింగాల అజయ్ జ్ఞాపకార్థంగా ఆయన స్నేహితులు 20 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణశెట్టి, క్లబ్ సెక్రటరీ రామనాథ్, ట్రెజరర్ అల్లాబకాష్, రవికుమార్‌రెడ్డి, చల్లా సూర్యనారాయణ, సత్యనారాయణ, కులశేఖర్, ఇస్మాయిల్, ఎల్ఐసి ప్రసాద్, శేషానందరెడ్డి, రామకృష్ణ, లియో సభ్యులు మంజునాథ్, లింగాల అజయ్, స్నేహితులు నవీన్ కుమార్, మల్లికార్జున, నసురుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

డిఎ జీవోను సవరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

22 నెలల ఆలస్యంగా మంజూరు చేసిన కరువు భత్యం బకాయిలను ఉద్యోగులు రిటైర్ అయ్యాక చెల్లిస్తామని జీవో జారీ చేయడం సరికాదని యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయిరాం, రామాంజనేయులు, ఓబులేష్ నారాయణస్వామి మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ఒకవేళ ఉద్యోగి మరణిస్తే అదుకునే వారు ఎవరని ఆవేదన చెందారు. ఇలాంటి జీవో చరిత్రలో ఎప్పుడూ చూడలేదన్నారు. పెన్షనర్లకు 2027-28 సంవత్సరంలో చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో 60, 61ను జారీ చేసిందని ఇది పూర్తిగా అన్యాయమన్నారు. సర్వీసు చేస్తున్న ఉద్యోగుల్లో పాత పెన్షన్‌దారులకు పిఎఫ్‌లో జంప్ చేయాలని, సిపిఎస్ ఉద్యోగులకు 90 శాతం నగదుగా, పెన్షనర్స్‌కు ఒకే విడుదల మంజూరు చేసేలా సదరు జీవోలను సవరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

అనంతపురం : పే రివిజన్ కమిషన్, బకాయిల చెల్లింపులను పక్కనపెట్టి కేవలం ఒకేఒక్క డిఎను విడుదల చేయడంపై బాధాకరని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఫ్యాప్టో ఛైర్మన్ శ్రీనివాస్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే అసంతృప్తిలో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన డిఎ జీఓ చాలా దారుణంగా ఉందని ఆవేదన చెందుతున్నారన్నారు. సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 19 నెలల బకాయిలు రిటైర్ అయ్యేనాటికి ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. అదేవిధంగా సిపిఎస్ వారికి ఇవ్వాల్సిన 90శాతం నగదు జమ గురించి ప్రస్తావన చేయకపోవడం సరైంది కాదన్నారు. వెంటనే జీఓలను సవరించాలని డిమాండ్ చేశారు.



కారుణ్య నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

కారుణ్య నియామకం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని జంతలూరు గ్రామం వద్ద ఉన్న అనంతపురం జిల్లా 14వ బెటాలియన్‌లో ఇద్దరి పోలీసు కుటుంబాలకు కారుణ్య నియామకం కింద ఉద్యోగ పత్రాలు అందించారు. రెడ్ శాండల్‌లో వీరమరణం పొందిన బిల్లి గణేష్, తమిళనాడు ఎలక్షన్ విధుల్లో ఉంటూ అనారోగ్యంతో మరణించి కానిస్టేబుల్ ఉదయ్ భాస్కర్ కుటుంబాలకు అడిషనల్ కమాండెంట్ కేశవరెడ్డి ఫ్యామిలీలకు కారుణ్య నియామకాలు ఉత్తర్వులను అందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్‌బాషా, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ నాగేంద్ర, రామారావు, రాఘవేంద్ర, జగదీష్, బెటాలియన్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్ఎస్ఐ శ్రీధర్, లైజనింగ్ ఆఫీసర్ ఆర్ఎస్ఐ నవీన్‌కుమార్, పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

29, 30న నిరసనలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29, 30వతేదీల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు యూనియన్ నాయకులు వన్నూరుస్వామి తెలిపారు. ఈమేరకు కమిషనర్ వంశీకృష్ణభార్గవ్‌కు కార్మిక సంఘం నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల డిమాండ్లపై ఇంతకు ముందు ఇచ్చిన వినతిపత్రం మేరకు న్యాయం జరగలేదన్నారు. పనిముట్లు, రక్షక పరికరాలు ఇవ్వాలని, దొంగ మస్టర్లను నియంత్రించాలని చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. ప్రభుత్వ సొమ్మును కొందరు సంబంధంలేని వ్యక్తుల ఖాతాల్లోకి ఎలా జమచేస్తున్నారని ప్రశ్నించారు. నాన్‌పిహెచ్‌డిగా పని చేస్తున్న సిబ్బందిని పరిశుభ్రత పనికి ఉపయోగించకుండా వేరే పనులకు ఉపయోగించుకోవడం మంచిది కాదన్నారు. ఈనెల 29న మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా, 30న టెంకాయ కొమ్మలు, గోనెసంచులతో పని చేస్తూ నిరసనలు తెలపనున్నట్లు వివరించారు. ఇందుకు స్పందించిన కమిషనర్ 'మీరే గలీజుగా ఉన్నారని, మొదట మిమ్మలందరినీ తీసివేయాలి..' అంటూ ఛీదరించుకోవడం కొసమెరుపు.

సోలార్‌కు భూముల గుర్తింపు సర్వే పూర్తి చేయండి

కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సోలార్ ప్రాజెక్టు కోసం భూముల గుర్తింపు సర్వే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోలార్ ప్రాజెక్టు కోసం భూసేకరణపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కంబదూరు మండలంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్రాజెక్టు కోసం 5,276.81 ఎకరాల భూమిని గుర్తించగా, ఇందులో నెలకొన్న భూసమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు 4,292.28 ఎకరాల గుర్తింపు పూర్తి కాగా, పెండింగ్ ఉన్న 984.53 ఎకరాల భూముల గుర్తింపు సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రాధాన్యతగా తీసుకుని భూసమస్యల పరిష్కరించాలని, పూర్తి అయిన భూములకు సంబంధించి లీజు అగ్రిమెంట్ కూడా చేపట్టాలన్నారు. వీలైనంత వరకు రైతులను ఒప్పించి భూ సేకరణ చేయాలని, సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం గుత్తి మండలంలో ఏర్పాటు చేసే సోలార్ ప్రాజెక్టుపై గుంతకల్లు ఆర్డీఓ, గుత్తి తహసీల్దార్, తదితరులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. గుత్తి మండలంలో ఏర్పాటు చేసే సోలార్ ప్రాజెక్టు భూముల గుర్తింపు సర్వే చేపట్టాలన్నారు. గుత్తి మండలంలోని బేతేపల్లి, ఊటకల్లు, ఊబిచర్ల, కరడికొండ, ధర్మపురం గ్రామాల పరిధిలో 2535.66 ఎకరాల భూమి గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, సర్వే ఎడి రూప్లానాయక్, ఎపి ఎన్.జి.ఈ.ఎల్ (ఎన్.టి.పి.సి) డెవలప్‌మెంట్ అధికారి కిషోర్‌రెడ్డి, ఎల్డిఎం నరేష్ రెడ్డి, కంబదూరు తహసీల్దార్ బాలకిషన్, ఎన్.టి.పి.సి అధికారులు శివకుమార్, వినోద్ కుమార్, గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్, గుత్తి తహసీల్దార్ పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలని వినతి

యాడికి : మండలంలోని పిన్నెపల్లి గ్రామంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కరించాలని ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ కన్వీనర్ దేవరాజు కోరారు. ఈమేరకు మంగళవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ వీర్రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు అందించినా స్పందించడం లేదన్నారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్య తీర్చాలని, లేకుంటే గ్రామస్తులతో కలిసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ గాంధీ, యాడికి ఎంఎస్‌పి అధ్యక్షులు లింగాల గుర్రప్ప, యువకులు వంశీకృష్ణ, రవి, మురళి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వినతి

శింగనమల : మండల కేంద్రం సమీపంలోని మరువకొమ్మ వద్ద విద్యుత్ స్తంభాలతోపాటు బస్‌స్టేషన్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మండల కేంద్రానికి చెందిన రామ్‌చరణ్‌యాదవ్ కోరారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని తహాశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరువకొమ్మ వద్ద విద్యుత్ లైట్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేగాకుండా భయభయంగా గడుపుతున్నారన్నారు. కావున వెంటనే స్పందించి విద్యుత్ సౌకర్యంతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండల ప్రజలు చక్రాయపేట మంగళ ఆదినారాయణ, బెస్త సుబ్బయ్య, ఓబులేసు, రామాంజ నేయులు నారాయణ, నల్లప్ప, తదితరులు ఉన్నారు.